
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 14 జనవరి 2023
5
తిరుపతి



28న తిరుమలలో రథసప్తమి

ప్రజాశక్తి -తిరుమల



తిరుమలలో ఈ నెల 28న జరిగే రథసప్తమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశామని, సూర్య ప్రభ వాహనం మొదలు రాత్రి జరిగే చంద్రప్రభ వాహనం వరకు భక్తులకు గ్యాలరీల్లో అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని ఈవో ధర్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం తిరుమల స్థానిక అన్నమయ్య భవనంలో డయల్ యువర్ కార్యక్రమం అనంతరం భక్తులను ఉద్దేశించి ఆయన మీడియాతో మాట్లాడారు. పది రోజుల పాటు జరిగిన ఉత్తర ద్వార దర్శనం 6.06 లక్షల మంది భక్తులు చేసుకున్నారన్నారు. శ్రీవారికి హుండీ ద్వారా 39.40 కోట్లు ఆదాయం లభించిందన్నారు..34.60 లక్షల లడ్డూ విక్రయాలు జరిగాయని, 13.71 లక్షల మంది అన్నప్రసాదం స్వీకరించారని ఆయన తెలియజేశారు.

దళితులకు పట్టాలిచ్చారు సరే....

ఆన్లైన్‌లో ఎక్కేదెప్పుడు..?

233 మంది రైతులు నిరీక్షణ
రైతుభరోసా అందని అన్నదాతలు



నీరువాయిలో పంపిణీ చేసిన భూమి

ప్రజాశక్తి - పిచ్చాటూరు

తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలంలోని నీరువాయి, మూడియూర్, కారూరు గ్రామానికి చెందిన పేదవారైన దళితులను రైతులుగా మార్చాలన్న ఉద్దేశ్యంతో టిడిపి ప్రభుత్వంలో 2018, డిసెంబర్ 4వ తేదీన పిచ్చాటూర్ ఐసీసీ క్రికెట్ మైదానంలో అప్పటి మంత్రి నారా లోకేష్ , జిల్లా అధికారుల చేతులు మీదుగా 233 మంది పేదవారికి 101.32 ఎకరాలు భూమిని రైతుల పేరు మీదుగా మార్చిన పట్టాలను బహిరంగ సభలో పంపిణీ చేశారు. అయితే నేటికీ రైతుల దగ్గర పట్టాలు మాత్రమే ఉన్నాయి. వాటి వలన వారికి ఎలాంటి ఉపయోగమూ లేదు. రైతులు ప్రభుత్వం అందజేసిన పట్టాలను బ్యాంకుల దగ్గరికి తీసుకెళితే 'మీకు ఆన్లైన్లో నమోదు చేసి ఈ పాస్ పుస్తకం లేనందున బ్యాంకులో లోన్లు ఇవ్వలేం' అని రైతులకు తెలపడంతో వెనుదిరుగుతున్నారు. అప్పటి తహశీల్దార్, ఇప్పటి గూడూరు ఆర్డీవో గా పని చేస్తున్న ఎం కిరణ్ కుమార్ గ్రామంలో అందరితో కలిసి భూములేని నిరుపేద కుటుంబాలకు భూ పంపిణీ కింద మంజూరు చేయుటకు 101.32 ఎకరాలు భూమిని సర్వే చేసి రాళ్లు నాటించి బౌండరీ గుర్తించారు. అనంతరం 233 మంది పట్టాదారు రైతన్నలకు లక్కీ లాటరీ ద్వారా పట్టాలు పంపిణీ చేశారు పట్టాలు పంపిణీ చేసిన తర్వాత ఆన్లైన్లో నమోదు చేయవలసిన సమయం నందు ఎలక్షన్ కోడ్ అడ్డు రావడంతో బదిలీపై తిరుపతికి వెళ్లిపోయారు, అనంతరం ప్రభుత్వాలు మారి నాలుగేళ్లయినా ఇప్పటికీ రైతుల భూములు ఆన్‌లైన్‌కు ఎక్కలేదు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పేద వారికి అండగా ఉంటానని చెప్పి వచ్చిన ప్రభుత్వం నేటికీ సిజిఎఫ్ ల్యాండ్‌లో భూ పంపిణీ చేసి, పట్టాలు అందజేసి పట్టాలను ఆన్లైన్ లో నమోదు కార్యక్రమాన్ని నేటికీ గుర్తించకపోవడం దారుణమని దళిత రైతులు మండిపడుతున్నారు. ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం తమలాంటి పేద రైతులను గుర్తించి శాశ్వతమైన రికార్డుల్లో మార్పులు చేసి పట్టాదారు పాస్ బుక్కులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

అనుమతి వచ్చిన వెంటనే న్యాయం చేస్తా : మధుసూదన్‌రావు, తహశీల్దార్



పిచ్చాటూరు మండలంలో మూడు గ్రామ పంచాయతీల పరిధిలో సిజిఎఫ్ భూములను 233 మంది రైతులకు 2018లో ఇచ్చాం. ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు జిల్లా పాలనాధికారి అనుమతి కోరుతూ రికార్డులు పంపించాం. జిల్లా అధికారుల నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకాలను అందిస్తాం.

అధికారుల నిర్లక్ష్యం దళితులకు శాపంగా మారింది.. నాలుగేళ్ల క్రితం పట్టాలిచ్చిన భూములు, ఇప్పటికీ ఆన్‌లైన్‌లో ఎక్కకపోవడంతో ప్రభుత్వం తరపున అందే ఏ లబ్దిని వారు పొందలేకపోతున్నారు. గత టిడిపి హయాంలో ఇచ్చిన భూములు కావడంతో ఇప్పటి వైసిపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. 101.32 ఎకరాల భూమిని 233 మంది రైతులకు నాలుగేళ్ల క్రితం ఇచ్చారు. మూడేళ్లుగా రైతు భరోసా అందక దాదాపు ఒక్కొక్కరు రూ.30వేల పైనే నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాస్‌బుక్కులు ఇప్పించండి : కుప్పమ్మ



ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వం కల్పిస్తున్న భూపంపిణీ కింద మా గ్రామంలో రైతులను గుర్తించి అప్పటి అధికారులు సర్వే చేసి భూమి ఇచ్చారు. కానీ ఆన్‌లైన్ చేయలేదు. కారణాలేమో మాకు తెలియదు. అధికారులు స్పందించి శాశ్వత పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరుతున్నాం.

రైతు భరోసా లేదు : కస్తూరి



రెవెన్యూ అధికారులు సిజిఎఫ్ భూములు చదును చేసి సర్వే చేసి హద్దులు కేటాయించి రాళ్లు నాటారు. పట్టాలు ఇచ్చారు. ఎంతో మేలు చేశారు. కానీ ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా మూడేళ్లుగా లేదు. 40వేల రూపాయలు నష్టపోయాను.

బ్యాంకుల్లో రుణాలివ్వడం లేదు : రూప



పొలంలో పంటలు వేయాలంటే డబ్బు కావాలి. పెట్టుబడులు పెట్టలేని పేదరికం మాది. భూమి చూపించి బ్యాంకుల్లో అప్పు తీసుకుందామంటే ఆన్‌లైన్‌కు ఎక్కలేదని తిప్పి పంపుతున్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేద్దామంటే వడ్డీలు కట్టలేని పరిస్థితి. మా గోడు ఎవరికి చెప్పుకోవాలి.

పండ్ల తోటలు పెట్టించండి : హంస



కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకంలో చిన్న సన్నకారు రైతులకు పండ్ల తోటలు పెట్టుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. నా భూమిని చదును చేసుకుని పండ్ల తోటలు పెట్టుకోవాలని ఉపాధి హామీ ఎపిఒ దగ్గరకు వెళితే నీ పేరు మీద రెవెన్యూ రికార్డులో పట్టాదారు పాస్ బుక్ లేదని, వన్ బి తెస్తేనే పండ్ల తోట పెట్టుకోవచ్చని చెప్పారు.



బాధితులకు అండగా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఎప్పటికీ అండగా ఉంటూ న్యాయం చేయడానికి ముందుంటుందని కమిటి ఛైర్మన్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ రెండో సమావేశం జరిగింది. ఎంఎల్‌సి బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం, ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డి, డిఆర్‌ఒ శ్రీనివాసరావు, ఆర్‌డిఒలు కనక నరసారెడ్డి, కిరణ్‌కుమార్, రామారావు, కన్వీనర్ చెన్నయ్య హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసులు 84 నమోదయ్యాయన్నారు. ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్ అయిన బాధితులకు మానిటరీ రిలీఫ్ ద్వారా రూ.62.20 లక్షలు నిర్దేశించిన సమయానికి చెల్లిస్తామన్నారు. గత త్రైమాసికంలో సెప్టెంబర్ ఆఖరి వరకు 39 కేసులు నమోదు కాగా, డిసెంబర్ వరకు 21 కేసులు నమోదయ్యాయని తెలిపారు. కేసులు తగ్గుముఖం పట్టడం శుభపరిణామమన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో ఇంకా హరిజనవాడలు అనే ఉన్నాయని, వాటి పేరు మార్పుకు చర్యలు తీసుకోవాలని కోరగా కలెక్టర్ స్పందిస్తూ డిపిఒ వారు గ్రామాల్లో గ్రామసభ తీర్మానం చేసి పంపాలని, గెజిట్ వెలువడిన తరువాత పేరు మార్పు జరుగుతుందన్నారు. ఎంఎల్ సి మాట్లాడుతూ గూడూరు నియోజక వర్గంలో ఒక అమ్మాయికి మోకాలి కీలు ఆపరేషన్ కొరకు ఆర్థిక సహాయం అవసరం ఉన్నప్పుడు కలెక్టర్ సత్వరమే స్పందించి రూ.1.45 లక్షలు సత్వరమే మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నారని కొనియాడారు. గ్రామాల్లో శాంతి భద్రతలు ఉండాలంటే అందరు కలిసి మెలసి ఉండాలని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ మహెూన్నత వ్యక్తి అని ఆయన రచించిన రాజ్యాంగం వలన ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాల వారికి అందరికీ స్వేచ్ఛ స్వతంత్రాలు ఉన్నాయని, దానిని దుర్వినియోగ పరచరాదని అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కేసుల నమోదులో ఏమైనా సమస్యలు ఉంటే పై అధికారులకు గానీ, తనకు నేరుగా సమాచారం ఇవ్వాలని సభ్యులకు సూచించారు. సమావేశ ప్రారంభంలో కన్వీనర్ చెన్నయ్య గత సమావేశ నిర్ణయాలపై తీసుకున్న చర్యలను కమిటీకి వివరించారు. ఈ కమిటీ సమావేశంలో అధికారిక సభ్యులుగా ఉన్న జిలా ఆడిట్ అధికారి జయపాల్, సభ్యులు ప్రసాద్ బాబు, వెంకటేశ్వరులు, మహేష్, సోమలమ్మ, సురేష్, ఎన్.జి.ఓ మెంబర్లు రోప్ సంస్థ మునిరామిరెడ్డి, ప్రగతి వెంకటరమణా, ఎ బి ఎం ఎం వెంకటాచలం పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వి.నాగరాజు

20న 'సంఘం..శరణం గచ్ఛామి' నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - గూడూరు

అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారిచే రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర 'సంఘం..శరణం గచ్ఛామి' నృత్య ప్రదర్శన 20న ప్రదర్శించబడనుంది. కెవిపిఎస్, ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్ టౌన్ కార్యదర్శి అడపాల ప్రసాద్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో 20న సాయంత్రం ఐదు గంటలకు జరిగే నృత్య ప్రదర్శనను దళిత ప్రజాసంఘాలు విజయవంతం చేయాలని నిర్ణయించాయి. అంబేద్కర్ అభిమానులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి హాజరై జయప్రదం చేయాలని వక్తలు కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.నాగరాజు, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గోని శివకుమార్, అడ్వకేట్ అరవ పార్వతయ్య, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు ఆదూరు రత్నం, ఏంబేటి చంద్రయ్య, జోగి శివకుమార్, పామంజి మణి, కెవిపిఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు నెల్లూరు యాదగిరి, సిఐటియు నాయకులు ఆర్.శ్రీనివాసులు, బివి రమణయ్య, కొట్టు శ్రీనివాసులు, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



ఉద్యోగం చేస్తోందనే అక్కసుతో ఇంటి స్థల వివాదం సాకుగా చూపి సంఘమిత్ర ధనలక్ష్మిపై మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తొట్టంబేడు మండలం చిన్నకనపర్తి గ్రామానికి చెందిన సంఘమిత్ర ధనలక్ష్మిని శుక్రవారం సీఐటీయూ నాయకులు పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ సంఘమిత్రగా పనిచేస్తున్న ధనలక్ష్మి, భాస్కరయ్య కుటుంబంపై అదే గ్రామానికి చెందిన హరినాధయ్య, రంగయ్యలకు అక్కసుందని చెప్పారు. ధనలక్ష్మిని ఉద్యోగం నుంచి తొలగించాలని చాలాసార్లు ప్రయత్నించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ధనలక్ష్మి తన ఇంటి ముందున్న సొంత స్థలంలో హద్దులు ఏర్పరచుకొని కంచె వేసుకోగా అందుకు హరినాధయ్య, రంగయ్యలు ఆక్షేపణ తెలిపారన్నారు. ఈ వివాదం కొనసాగుతుండగానే హరినాధయ్య, రంగయ్యలు తిరుపతికి చెందిన శివప్రసాద్, సుబ్రమణ్యంతో పాటు మరికొంతమందిని తీసుకువచ్చి గురువారం పట్టపగలే ధనలక్ష్మిపై మారణాయుధాలతో దాడి చేశారని వాపోయారు. అడ్డొచ్చిన ఆమె భర్తతోపాటు బంధువులపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రక్త గాయాలైన ధనలక్ష్మిని బంధువులు శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారని, అయితే తొట్టంబేడు పోలీసులు ధనలక్ష్మి పై దాడి చేసిన వారిపై కాకుండా ఇరు వర్గాలపై కేసు నమోదు చేయడం అన్యాయమని మండిపడ్డారు. ఎస్పీ స్పందించి ధనలక్ష్మిపై దాడి కేసును సమగ్రంగా పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు పెనగడం గురవయ్య, గెడి వేణు పాల్గొన్నారు.

స్టూడెంట్ ఛాంపియన్‌షిప్ విజేతలను వెల్లడించిన లీడ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



అతిపెద్ద స్కూల్ ఎడ్‌టెక్ కంపెనీ లీడ్, తమ లీడ్ చాంఫియన్‌షిప్ 2022 విజేతలను వెల్లడించింది. లీడ్ పవర్డ్ స్కూల్ విద్యార్థుల కోసం ప్రత్యేకమైన, జాతీయ స్థాయి వేదిక ఇది. లీడ్ చాంఫియన్‌షిప్ 2022 ను భారతదేశ వ్యాప్తంగా 3వేలకుపైగా లీడ్ భాగస్వామ్య స్కూల్స్‌లోని 1.2 మిలియన్‌ల 9వ తరగతి లోపు ప్రీ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు నిర్వహించారు.లీడ్ కో ఫౌండర్, సీఈఓ సుమీత్ మెహతా మాట్లాడుతూ "లీడ్ చాంఫియన్‌షిప్ 2022 విజేతలకు హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులతో పోటీపడి విజయం సాధించడం సాధారణ అంశమేమీ కాదని, ముఖ్యంగా చిన్న పట్టణాల విద్యార్థులు, వారి అంకిత భావం, నమ్మకం, కష్టం, సహజసిద్ధమైన ప్రతిభకు ఈ చాంఫియన్‌షిప్ నిదర్శనంగా నిలుస్తుందన్నారు. లీడ్ విద్యార్థుల సమగ్ర అభివద్ధి ప్రయాణంలో భాగం కావడాన్ని ఓ గౌరవంగా భావిస్తున్నాము" అని అన్నారు. ప్రతిభ ఎడ్యుకేర్ స్కూల్‌కు చెందిన ఎస్ ముస్కాన్‌సింగ్ మాట్లాడుతూ "లీడ్ చాంఫియన్‌షిప్ 2022 లో విజేతగా నిలవడం ఆనందంగా ఉందన్నారు.

సంక్రాంతి పోరాడే శక్తినిస్తుంది

- నారావారిపల్లిలో 'వియ్యంకుల' సందడి
- ఊళ్లో అందరినీ పలకరించిన చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఈ సంక్రాంతి భవిష్యత్‌పై భరోసా కోసం పోరాడే శక్తినిస్తుందని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. సంక్రాంతి మూడు రోజుల పాటు జన్మస్థలమైన నారావారిపల్లిలో గడిపేందుకు చంద్రబాబు కుటుంబం, హీరో బాలకృష్ణ కుటుంబం నారావారిపల్లికి చేరుకున్నాయి. నారావారిపల్లిలో చంద్రబాబు, బాలకృష్ణలు వేర్వేరుగా టిడిపి నాయకులను, అభిమానులను, బంధువులను పలకరించి ఫొటోలు తీసుకున్నారు. మూడేళ్ల తరువాత సంక్రాంతి పండగకు విచ్చేసిన నారా చంద్రబాబునాయుడును అభిమానులు, కార్యకర్తలు కలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఎన్ఆర్ఐలు స్వగ్రామాలకు చేరుకుంటే సంక్రాంతికి కల వస్తుందన్నారు. నూతన ఉత్సాహం కోసం ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగాలన్నారు. ఆంధ్రప్రజలకు, తెలుగు జాతికి తాను ఇచ్చిన ఆయుధం ఐటి అని అన్నారు. ఈ ప్రభుత్వానికి అభివృద్ధి చేయాలనే ధ్యాస లేకపోగా బ్రాండ్ డ్యామేజి ఇమేజిను సొంతం చేసుకుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే ప్రజలు గుర్తిస్తారన్నారు. పవన్‌కల్యాణ్ మీటింగ్ పెడితే తిడతారని, తాను మీటింగ్ పెడితే కుట్ర చేసి మనుష్యులను చంపి జీవోలను తీసుకొస్తారని మండిపడ్డారు. తన లెక్క ప్రకారం రాజకీయాలకు అర్హత లేని వ్యక్తులు వైసిపి నాయకులన్నారు. ప్రజాస్వామ్యంలో సేవాభావంతో పనిచేసే వ్యవస్థ రాజకీయమని, ఈ వ్యవస్థలో రౌడీయిజం, గూండాయిజం, హత్యలు, కుట్రలు, కుతంతాలకు తావులేదన్నారు. తప్పులు చేస్తూ ఆ తప్పును పోలీసుల ద్వారా కప్పి పుచ్చుకోవాలని చూస్తున్నారన్నారు.

బాలకష్ణకు ఘన స్వాగతం

రేణిగుంట విమానాశ్రయంలో సినీ నటుడు నందమూరి బాలకష్ణకు శుక్రవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, తెలుగు యువత నాయకులు రూపేంద్ర వర్మ, ఘనంగా స్వాగతం పలికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బాలకష్ణ సంక్రాంతి పండుగ సందర్భంగా నారావారిపల్లికు చేరుకున్నారు. సంక్రాంతి పండుగ మూడు రోజులపాటు నారవారిపల్లెలోనే పండగ జరుపుకుంటారు.



టిటిడిపై విమర్శలు సరికాదు : ఈవో

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో కొన్ని వసతి గదులకు రేట్లు పెంచడంపై వివాదం చెలరేగుతోంది. బీజేపీ, టీడీపీ సహా పలు రాజకీయ పార్టీలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఇష్టారీతిన రేట్లు పెంచేస్తే..కొండ మీద భక్తులు ఎలా ఉండాలంటూ ప్రశ్నిస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలపై తిరుమల తిరుపతి దేవస్థానం స్పందించింది. తిరుమలలో అద్దె గదుల ధరలు పెంచారన్న విమర్శలు సరికాదని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అన్నారు. సామాన్య భక్తులకు కేటాయించే గదుల ధరలు పెంచలేదని స్పష్టం చేశారు. రాజకీయంగా దీనిపై చర్చ చేస్తున్నారని మండిపడ్డారు. పూర్తి సమాచారం తెలుసుకోకుండానే మాట్లాడటం బాధాకరమన్నారు. తిరుమలలో శ్రీవారి భక్తుల సౌకర్యార్థం మొత్తం 7500 గదులు ఉన్నాయి. అందులో 5000 గదులు 50 రూపాయలు, 100 రూపాయలు టారిఫ్ తో భక్తులకు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన 1250 గదులు మాత్రం వెయ్యి రూపాయల టారిఫ్‌తో..ఎవరైతే ఆన్లైన్ ద్వారా 300 రూపాయల ఎస్.ఈ.డి దర్శనాలు బుక్ చేసుకుంటారో వారికి అడ్వాన్స్ ఆన్లైన్ అకామిడేషన్ ఆప్షన్ ద్వారా బుక్ చేసుకునేందుకు గాను ఉంటాయని టీటీడీ ఈవో ధర్మారెడ్డి చెబుతున్నారు.మరో 1250 గదులు తిరుమలలోని పద్మావతి ఏరియాలో వీవీఐపీల కోసం కేటాయించారు..ఇందులో 170 గదులకు మాత్రం ఏసీలు, గీజర్లు, వుడెన్ కబోర్డ్స్, కాట్స్ లాంటి వాటితో ఆధునీకరించారు. ఈ 170 గదులకు మాత్రమే అద్దెలు పెంచామని..పైగా ఇవి వీవీఐపీలకు మాత్రమే కేటాయిస్తున్నట్లు ఈవో చెప్పారు.. దీనివల్ల.. తిరుమల తిరుపతి దేవస్థానానికి ఎటువంటి ఆదాయం కూడా ఉండదని ధర్మారెడ్డి క్లారిటీ ఇచ్చారు.

సామాన్యుల గదులు విఐపిలకు కేటాయించొద్దు : సిపిఎం

తిరుమల కొండమీద సామాన్యులకు కేటాయించే గదుల్లో సౌకర్యాలు పెంచి, వీఐపీల ధరలు నిర్ణయించామని టీటీడీ యాజమాన్యం చెప్పడం విడ్డూరంగా ఉందని, సామాన్యులకు కేటాయించబడ్డ గదులను వారికే కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విఐపి జోన్లో సామాన్యులకు ప్రవేశం లేకుండా చేసినట్టుగా తయారైందని ఆయన ఆ ప్రకటనలో విమర్శించారు. టిటిడి యాజమాన్యం పునరాలోచన చేయాలని, సామాన్యుల గదులను వారికే కేటాయించాలని ఆ ప్రకటనలో కోరారు. బిజెపి మత సమస్యగా చిత్రీకరించి ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి చేస్తున్న ప్రయత్నాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ధరల పెంపు సమస్యను కాకుండా దీనికి మతం రంగు పులిమి ఓ పక్షాన్ని రెచ్చగొట్టే రీతిలో బిజెపి వైఖరి ఉందని ఇది నష్టం చేకూరుస్తుందని అన్నారు. ప్రజలు బిజెపి తప్పుడు వైఖరిని గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా వివాదాలకు తావు లేకుండా టీటీడీ యాజమాన్యం, టిటిడి బోర్డు బాధ్యతగా వ్యవహరించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

'కోత' పెడితే ప్రభుత్వానికి 'వాతే'..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'బటన్' నొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి డబ్బుల కోసం వెతుకులాట.. దినదినగండం నూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా ప్రభుత్వ తీరు ఉంది. ఈ క్రమంలోనే జగన్మోహన్‌రెడ్డి 'సంక్షేమానికి' కోత విధిస్తూ 'వెరిఫికేషన్' పేరుతో పేర్లు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఈ 'కోత' నియోజకవర్గంలో తమకు ఎక్కడ 'వాత' పెడుతుందోనని ఎంఎల్‌ఎలు, మంత్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ నియోజకవర్గంలోనైనా అధికార, ప్రతిపక్ష పార్టీలకు మధ్య ఓట్లను చీల్చేది వేలల్లోనే ఉంటుంది. సంక్షేమానికి కోత పెడితే ఎక్కడ తమ పట్ల వ్యతిరేకత వస్తుందోనని ప్రజాప్రతినిధులు మదనపడుతున్నారు. చూసీ చూడనట్లు పోవాలంటూ అధికార యంత్రాంగంపైన ఒత్తిడి తెస్తుండటం గమనార్హం. తాజాగా పింఛన్ల కోత వైసిపి ప్రజాప్రతినిధుల మెడకు చుట్టుకోనుంది. గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గాలి భానుప్రకాష్‌పై మంత్రి ఆర్‌కె రోజా 2,708 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అయితే నగరి, పుత్తూరు మున్సిపాలిటీల్లో 3వేలకు పైగా పింఛన్ల కోత పడనుంది.

పింఛన్లలో కోత వైసీపీ ప్రజాప్రతినిధుల మెడకు చుట్టుకుంటోంది. అసలే ఎన్నికలు వస్తున్న తరుణంలో ఇలాంటి

మంత్రి నియోజకవర్గంలో 'పింఛన్ల'పై మల్లగుల్లాలు

చర్యలు రాజకీయంగా నష్టం తెస్తాయనే ఆవేదన అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో వుంది. తక్కువ మెజార్టీతో బయటపడిన ఎమ్మెల్యేల్లో ఆవేదన కాస్త ఎక్కువే. మంత్రి రోజా పింఛన్ల కోతపై లబోదిబోమంటున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాశ్‌పై ఆమె 2,708 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇప్పుడు ఆమె ప్రభుత్వంలో ఉన్నారు. దీంతో ప్రభుత్వంపై వ్యతిరేకత, ఇతరత్రా అంశాలన్నింటిని ఎదుర్కొని తిరిగి గెలవాల్సి వుంటుంది.వ్యతిరేకతకు ఏ చిన్న అవకాశం ఇవ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదే. ఈ నేపథ్యంలో ఒక్క నగరి మున్సిపాలిటీలోనే వివిధ రకాల పింఛన్లు 1,623 చొప్పున కోత విధించేందుకు అధికారులు నిర్ణయించారు. అలాగే పుత్తూరు మున్సిపాలిటీలో కాస్త అటుఇటుగా ఇదే సంఖ్య వుంది. గ్రామీణ స్థాయిలో పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నగరి వైసీపీ నేతలు అంటున్నారు. ఈ నెల 18వ తేదీ వరకూ వెరిఫికేషన్‌కు ప్రభుత్వం సమయం ఇచ్చిందని సమాచారం. పింఛన్ల కోతకు సంబంధించి లబ్ధిదారులు వైసీపీ నేతల వెంటపడుతున్నారు. దీంతో మంత్రి రోజాతో పాటు ఆ నియోజకవర్గంలోని వైసీపీ నేతలు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ...ఎన్నికల సమయంలో తమకు నష్టం కలిగించే పనులు చేయెుద్దని ఆగ్రహించినట్టు సమాచారం. తాము గెలిచిందే 3 వేల లోపు మెజార్టీతోనే అని, తీరా పింఛన్లు కూడా అదే సంఖ్యకు తగ్గకుండా చేస్తే...తాము ఏం చేయాలని మంత్రి రోజా నిలదీసినట్టు తెలిసింది. ఒక వైపు వెరిఫికేషన్ సమయం సమీపిస్తుండడం, మరోవైపు అధికారుల నుంచి తగినంతగా భరోసా లభించకపోవడంతో అధికార పార్టీ నేతల్లో ఆందోళన కనిపిస్తోంది.

ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు తీసుకుంటున్న వారిలో ఎంత మంది ఓట్లు వేస్తారో తెలియదు కానీ, కోల్పోయిన లబ్ధిదారులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అధికార పార్టీకి వ్యతిరేకంగా ఎన్నికల్లో వ్యవహరిస్తారని అధికార పార్టీ నేతలు వాపోతున్నారు. దీంతో ఒక్కో ఇంట్లో నాలుగేసి ఓట్లు చొప్పున లెక్కేసుకున్న ఐదారు వేల ఓట్లు కోల్పోతామని రోజా వాదన. రోజాతో పాటు వైసీపీ ఎమ్మెల్యేల ఆవేదనను ముఖ్యమంత్రి జగన్ ఎంత వరకు పట్టించుకుంటారో వేచి చూడాలి.

పశువులకు ఉచిత సాధారణ చికిత్సలు



ప్రజాశక్తి- పిచ్చాటూరు : మండలంలోని పాతశివగిరి పంచాయతీలో శుక్రవారం పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి డాక్టర్ మంజుల అధ్వర్యంలో పశువులకు ఉచిత వైద్య సేవలు అందించారు. శిబిరంలో 12 దూడలకు నట్టల నివారణ, 8 పశువులకు గర్భకోశ చికిత్సలు, 20 పశువులకు సాధారణ చికిత్సలు, 90 పశువులకు బూటాక్స్ పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులలో లంపీ చర్మ వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు విజయ్ కుమార్, నాగేంద్ర, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉచితంగా నంబర్లు అందించాలని వినతి



ప్రజాశక్తి -గూడూరు : గూడూరు పట్టణంలో గత వారం రోజులుగా ఆటోలకు పోలీసు నంబర్లు వేయించుకోవాలని.. ఒక్కొక్క ఆటోకి రూ.200 చెల్లించాలని పోలీస్ అధికారులు చెబుతున్నారని.. తిరుపతిలో మాదిరిగానే ఉచితంగా పోలీస్ నంబర్లు అందించాలని ఆటో డ్రైవర్లు శుక్రవారం డీఎస్పీ ని కలిసి విన్నవించారు. తాము ఆటోలు నడిపి ఫైనాన్స్ లు కట్టుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని.. పోలీసు నంబర్లు, గుర్తింపు కార్డులు ఉచితంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఆటో కార్మిక సంఘం నాయకులు బి.వి రమణయ్య, గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, చిన్న, ధనయ్య, రమేష్ , షఫీ, లక్ష్మణ్, బాషా, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెల్విన్ జోన్స్ జయంతి



ప్రజాశక్తి-గూడూరు రూరల్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ జయంతి వేడుకలను శుక్రవారం గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ ఛైర్మన్ శ్రీరాములు, జోన్ ఛైర్మన్ కామాక్షి దేవి, పంచాయతీ రాజ్ ఈఈ గిరిప్రసాద్, కళ్యాణ్ సాయి, డిస్ట్రిక్ట్ ఛైర్మన్లు రామ్మోహన్, మురళీరెడ్డి, శీనయ్య , ఇలియజ్ అహ్మద్ , రూపేష్‌రెడ్డి, సెక్రెటరీ మురళీరెడ్డి , రవిచంద్రారెడ్డి , మదన మేటి రమణయ్య , రామచంద్రయ్య, పీఆర్ డీఈఈ రవీంద్ర కుమార్, కళ్యాణ్ సాయి, చెంచు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలకు చెత్త తరలించే ఆటోలు

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: మండలంలోని పది సచివాలయాలకు చెత్త తరలించేందుకు ఆటోలను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శుక్రవారం చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో కార్యాలయానికి అందించారు. మేజర్ పంచాయతీలైన భాకరాపేట, చిన్నగొట్టిగల్లు సచివాలయాలకు రెండేసి చొప్పున, మిగిలిన ఎనిమిది సచివాలయాలకు ఒక్కొక్కటి తుడా నిధులతో సమకూర్చారని ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి అన్నారు. ఆయన ఆటోలను ఆయా సచివాలయాలకు అందజేశారు. గ్రామాల్లో మరింత మెరుగ్గా చెత్తను తరలించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ ఆటోలు దోహదపడుతాయని.. ఎంపీడీవో దేవేంద్రబాబు, ఈవోపీఆర్డీ మదనమోహనరాజు, డిజిటల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, సెక్రటరీలు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల శ్మశానాలకు దారులు ఏర్పాటు చేయాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : ఎస్సీ, ఎస్టీల శ్మశానాలకు దారులు ఏర్పాటు చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణరెడ్డికి ఎస్సీ, ఎస్టీ సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య సభ్యులతో కలిసి శుక్రవారం వినతిపత్రం అందించారు. తిరుపతిలో జిల్లా ఎస్టీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. అలాగే ఎస్టీ, ఎస్సీ గ్రామాలకు శ్మశానం దారి ఏర్పాటు కోసం ప్రతినెలా 30వ తేదీన పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



ప్రజాశక్తి బాలాయపల్లి : జయంపు గ్రామంలో ఏబీఆర్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం జయంపు పి ఎ సి ఎస్ అధ్యక్షులు వెందోటి కార్తీక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులు చాలామంది ఉన్నారని, క్రీడలతో వారిలో ఉత్తేజం పెంపొందించాలన్నారు. వైసీపీ నాయకులు మల్లెల వెంకటేశ్వర్లు, జయంపు యూత్, క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి- 9 మంది అరెస్టు



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని చెరుకువారిపల్లి పంచాయతీ పరిసర ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా కొంతమంది కోడి పందెం ఆడుతుండగా బాకరాపేట ఎస్సై ప్రకాష్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం దాడి చేశారు. మూడు కోడిపుంజులు, రూ.10 వేలు నగదును స్వాధీనం చేసుకొని 9 మందిని అరెస్టు చేశారు. ఎవరైనా చట్టానికి విరుద్ధంగా కోడిపందేలు ఆడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనుమూరు సేవలు స్ఫూర్తిదాయకం



ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పట్టణంలో ఏటా పండుగలకు ముందే క్రీడల పండుగకు శ్రీకారం చుడుతున్న కేహెచ్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కనుమూరు హరిచంద్రారెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో మాస్టర్ క్రికెట్ లీగ్ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదిహేనేళ్లుగా పట్టణంలో పండుగల సమయంలో క్రీడాకారులకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. పోటీలలో తానూ ప్రాతినిధ్యం వహిస్తుండటం చాలా సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. ఓ వైపు పట్టణాభివద్ధికి సొంత నిధులు కేటాయించి పట్టణంలో అనేక అభివద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారన్నారు. అలాగే జాతీయ స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. క్రీడలు, ఆరోగ్యం, సేవా కార్యక్రమాలతోపాటు అధ్యాత్మిక కార్యక్రమాలకు రూ.కోట్లు వెచ్చిస్తున్న ఘనత కనుమూరు హరిచంద్రారెడ్డికే దక్కుతుందన్నారు. కేహెచ్ఆర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు కనుమూరు హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు ఆరోగ్యం, వినోదం, ఉల్లాసం కల్పించేందుకు మాస్టర్ క్రికెట్ లీగ్ పోటీలు దోహదపడుతున్నాయన్నారు. అనంతరం అతిథుల చేతులమీదుగా క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మనపాటి రవీంద్ర, దేవానంద్, నాగేశ్వరరావు, రజనీకాంత్, సునీల్, నూర్ అహ్మద్, అన్ని జట్ల కెప్టెన్లు, వెటరన్ క్రీడాకారులు పాల్గొన్నారు.



గూడూరు : మానసిక ఉల్లాసానికి క్రీడలు ప్రధానమని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని యువకుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఈనెల 17,18వ తేదీలలో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రీడాకారుల టీ షర్టులను ఆయనతోపాటు కనుమూరి హరిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, వైసీపీ నాయకులు మనపాటి రవీంద్రబాబు, మునిగిరీష్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆత్మకూరు సురేష్, ప్రతినిధులు గోపి, మస్తాన్, కపానిధి, నిరంజన్, మోహన్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులు శివకుమార్, జనార్దన్, బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో అవంతి పరిశ్రమ చెలగాటం

ప్రజాశక్తి-వరదయ్యపాళ్యం: మండలంలో అవంతి చర్మ పరిశ్రమ వద్ద వరదయ్యపాళ్యం, బీఎన్ కండ్రిగ మండలాల ప్రజాప్రతినిధులు, స్థానికులు శుక్రవారం నిరసన తెలిపారు. వివరాలిలా.. వరదయ్యపాళ్యం మండలం పర్యాటక ప్రాంతం ఉబ్బలమడుగు సమీపంలోని అవంతి పరిశ్రమ నుంచి ప్రాణాంతక రసాయన వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా కాలువలోకి వదలి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ ప్రజాప్రతినిధులు ప్రసాద్, దుడ్డు వేణు ఆధ్వర్యంలో స్థానికులు చర్మ పరిశ్రమ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమ ఆవరణం వద్దకు చేరుకొని ఇటువంటి పనులు మానుకోవాలని కోరారు. అందుకు పరిశ్రమ యాజమాన్యం విరుద్ధంగా స్పందించడంతో కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. పరిశ్రమ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రసాద్ మాట్లాడుతూ రాత్రి వేళ ప్రాణాంతక వ్యర్థాలను వదలడంతో పంటలు ఎండిపోతున్నాయని, ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని, ప్రజల ప్రాణాలంటే లెక్క లేదా.. అంటూ మండి పడ్డారు.



తాము వ్యర్థాలను కాలువలో వదలడం లేదని పరిశ్రమ ప్రతినిధులు బుకాయించారు. దీంతో లోపలకు వెళ్లి పరిశీలిస్తామని.. అప్పుడు నిజాలు తెలుస్తాయని ప్రజాప్రతినిధులు పట్టుబట్టడంతో పరిశ్రమ ప్రతినిధులు లోనికి నిరాకరించారు. తప్పుచేయకపోతే లోనికి ఎందుకు అనుమతించరని ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. ఎస్సై నాగార్జునరెడ్డి చేరుకుని ఇరువర్గాలతో చర్చించి లిఖిత పూర్వక హామీ ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.


టీడీపీతోనే అందరికీ సమాన న్యాయం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్ ప్లాన్ నిధులు.. సంక్రాంతి కానుకలు రద్దు చేసి, ఉపాధి లేక యువతను నిర్వీర్యం చేసి, చీకటి జీవోలతో ప్రజలను, ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తే ప్రజాస్వామ్యంలో కుదరదని.. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో–1ని హైకోర్టు బ్రేక్ వేయడం హర్షనీయమని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. శుక్రవారం పుత్తూరు మండలంలోని కష్ణ సముద్రం పంచాయతీలో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత 75 ఏళ్లలో ఏ ప్రభుత్వం ఇలాంటి జీవో తీసుకురాలేదని హైకోర్టు వ్యాఖ్యానించడం వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క ఛాన్స్ పాలన చూసిన ప్రజలు ఎప్పుడెప్పుడు పనికిమాలిన ప్రభుత్వం దిగిపోతుందా అని ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఎస్సీ, బీసీ సబ్ ప్లాన్ రద్దు చేసి కోట్ల నిధులు వారికి కాకుండా చేశారని.. టీడీపీ పాలనలో ప్రతి సంక్రాంతికి పేద ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని అందించిన సంక్రాంతి కానుకలు నిలిపివే యడం దారుణమన్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెంచడంతో పేద ప్రజలు పండుగలకు సంతోషంగా ఉండలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బాలాజీ, కరుణ, జగదీష్, శాంతరాజ్, విజయ్, రాజా, నరేష్, విజయ్, సురేష్, జగదీష్, నరేష్, బాలరాజు, పాండ్యన్, ఆనందరాజ్, ఆమూల్‌రాజ్, చంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కలునరీ యూనివర్సిటీతో మహిళా వర్సిటీ ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లోని గహ విజ్ఞాన శాస్త్రం, ఇండియన్ కలునరీ యూనివర్సిటీ తో మహిళా వర్సిటీ అవగాహనా ఒప్పందం శుక్రవారం విసి చేసుకున్నారు.ఈ మేరకు వర్సిటీ అధికారులు అవగాహన ఒప్పంద పత్రాలను వర్సిటీ ఇంచార్జ్ ఉపకులపతి ఆచార్యకే రాజారెడ్డి ఆధ్వర్యంలో మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం ఓ యు యొక్క ముఖ్య ఉద్దేశం ఏమిటంటే రెండు విద్యాసంస్థల మధ్య ఉన్నటువంటి సదుపాయాలని విద్యార్థుల కొరకు వినియోగించుకోవచ్చని చెప్పారు. విద్యార్థులలో స్కిల్ డెవలప్మెంట్ ను పెంచడానికి ఉపయోగకరముగా ఉంటాయని, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కి తోడ్పడుతుందని వెల్లడించారు. అధ్యాపకుల యొక్క అవసరాన్ని బట్టి ఈ రెండు విద్యాసంస్థలు వారిని కూడా వర్క్ షాపులు, కాన్ఫరెన్స్ లు, సెమినార్లలో కాని ఇతర గెస్ట్ స్పీకర్లుగా ఉపయోగపడతారని అన్నారు. ఈఎంఓయూ రెండు విద్యాసంస్థల యొక్క రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇంచార్జ్ విసి ప్రొఫెసర్ రాజా రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజనీ, గహ విజ్ఞాన శాస్త్ర హెచ్ ఓ డి ప్రొఫెసర్ ఎం. అరుణ, పి.ఆర్.ఓ శ్రీరజని, ఇండియన్ కలునరీ ఇన్స్టిట్యూట్ అకాడమిక్ ఇంచార్జ్ డాక్టర్ ఎం. త్రిలోక్ చంద్ ఫ్యాకల్టీ డాక్టర్ లోంతే దౌలత్రావు పాల్గొన్నారు.



శ్రీరామ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు




ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి–కరకంబాడీ మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో ముందస్తుగా కళాశాల సిబ్బంది, విద్యార్థులు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరువుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడలను నిర్వహించారు. విద్యార్థినులు ముగ్గుల పోటీల్లో పాల్గొని అందమైన రంగవల్లులను వేశారు. విద్యార్థులు గాలిపటాలను ఎగురవేశారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి బహుమతుల ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జయచంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో ప్రతిఒక్కరూ ఎంతో ఘనంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అని, మన కళాశాలలో ముందస్తు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో....

తిరుపతి–కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ' హరివిల్లు ' పేరుతో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణమంతా రంగవల్లులు, గాలిపటాల పోటీలు, బొంగరాలు, గోలీ ఆటలు, ఉట్టి కొట్టడం ఇలా గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా సాంప్రదాయ వస్త్ర ధారణలు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి తెలిపారు. కళాశాల ఛైర్మన్ గంగిరెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రకాష్ అంబవరం, సెక్రటరీ ప్రదీప్ అంబవరం పాల్గొన్నారు.

వీబీఆర్‌లో సంక్రాంతి సంబరాలు

తిరుపతి: స్థానిక తిరుపతి మార్గంలోని వి బి ఆర్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్, జెఫన్యా ఫిజియోథెరపి, నర్సింగ్ కళాశాలల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి అనగానే గుర్తుకొచ్చే సాంస్కతిక సంప్రదాయాలు , సాంప్రదాయ వస్త్రధారణలతో.. ముచ్చటైన రంగు వల్లులతో కళాశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ విజయ్ భాస్కర్ యాదవ్ విద్యార్థులకు, సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. యాదవ స్టూడెంట్స్‌కి బిపిటి, బీఎస్సీ నర్సింగ్ ,ఏఎన్ఎం ,జిఎన్ఎమ్ ,పి.బి నర్సింగ్, బీఎస్సీ అగ్రికల్చర్ ,పారామెడికల్ ,ఒకేషనల్ కోర్సులలో స్కాలర్‌షిప్ అందిస్తామన్నారు. నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీజ కళ్యాణి, వైస్ ప్రిన్సిపల్ శ్రావణి , ఫిజియోథెరపీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ కుమార్ రెడ్డి, అగ్రికల్చర్ కాలేజీ ప్రిన్సిపల్ సునంద రెడ్డి, పారా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ దీప్తి, వైస్ ప్రిన్సిపల్ హేమలత ,ఒకేషనల్ కాలేజ్ ప్రిన్సిపల్ స్నేహ ,వైస్ ప్రిన్సిపల్ అతుల్య , కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



'ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం'

తిరుపతి టౌన్ : సిఐటియు అఖిల భారత మహాసభలు బెంగుళూరు పట్టణంలో జనవరి 18–22 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో వాటిని జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం యశోదానగర్‌లో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందామని, ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దామని పిలుపునిచ్చారు. 22న జరిగే బహిరంగసభకు తిరుపతి నగరం నుంచి వేలాదిగా తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.మునిరాజా, టి.మురళి, పద్మ పాల్గొన్నారు.

నగర ప్రజలకు శుభాకాంక్షలు : మేయర్

తిరుపతి టౌన్ : నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని, ప్రజల జీవితాల్లో మరింత వెలుగులు నింపాలని మేయర్ శిరీష అన్నారు. నగర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

డీన్ ఫాకల్టీ ఆఫ్ సైన్స్ గా ఆచార్య రత్నాకర్

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూనివర్సిటీ సైన్స్ కళాశాల ఫాకల్టీ డీన్ గా భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన సీనియర్ ఆచార్యులు రత్నాకర్ ను నియమిస్తూ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె రాజారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కు రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ తదితర ఆచార్యులు అభినందనలు తెలిపారు. ఆచార్య రత్నాకర్ 31 సంవత్సరాలుగా బోధన పరిశోధన రంగాల్లో కృషిచేశారు. కావలి పిజి సెంటర్ యస్ ఓ గా , శాఖాధిపతిగా. బి ఓ యస్ గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం డీన్ డెవలప్మెంట్ గా పనిచేస్తున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి-తిరుమల: తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర రెడ్డి, తెదేపా ఎమ్మెల్యే మంతెన రామరాజు, వైకాపా ఎమ్మెల్యే వాసుబాబు, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య లు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

అధికారుల సూచనలతో దిగుబడులు



ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని చిల్లకూరు, జీలపాటూరు గ్రామాల పంట పొలాలకు సంబంధించి శనివారం పొలంబడి కార్యక్రమంలో భాగంగా పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంచాలకులు భాస్కరయ్య మాట్లాడుతూ నాణ్యమైన ఎక్కువ దిగుబడి వచ్చేటువంటి పంట విధివిధానాలను రైతులకు వివరించారు. కాలానుగుణంగా, దశలవారీగా పంటలకు వచ్చే తెగుళ్లు, వాటి నివారణ, ఏ మందులను ఎంత మోతాదులో వాడాలో వివరించారు. నాయుడుపేట వ్యవసాయ సహాయకులు హైమావతి రైతులకు వరి సాగుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పెళ్లకూరు మండల వ్యవసాయ అధికారి ప్రవీణ, సర్పంచ్ శివకుమార్ జిల్లా వ్యవసాయ అధికారులు శ్రీనివాసులు, వేణుగోపాల్ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-పలమనేరు: పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేసి భారీ నగదుతోపాటు మోటార్‌సైకిళ్లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని 17 మందిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఈనెల 12న గురువారం పలమనేరు మండలం మొరం పంచాయతీ సమీపంలోని పత్తికొండ రిజర్వ్ ఫారెస్ట్ లో కొలమాసనపల్లి గ్రామానికి చెందిన శంకర్, పెద్దపంజాణి మండలం అప్పినపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ ఇరువుర్లు ఆర్గనైజర్లుగా వ్యవహరిస్తూ వారికి తెలిసిన వ్యక్తులతో మంగతాయి అనే జూదం ఆడిస్తున్నట్లు అజ్ఞాత వ్యక్తుల ద్వారా పక్కా సమాచారం అందింది. ఈ మేరకు సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సైలు నాగరాజు, సుబ్బారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ పోలీస్ శ్రీనివాసులు, క్రైమ్ పార్టీ సిబ్బంది మూకుమ్మడిగా దాడి చేసి పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. వారి నుంచి రూ.3.83 లక్షల నగదు, 16 మోటార్ సైకిళ్లు, 17 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు. పోలీస్ సిబ్బందిని డీఎస్పీ సుధాకర్ రెడ్డి అభినందించారు.

సాధారణ వార్తలు

తిరుమల పరిణామాలపై సీఎం స్పందించాలి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమలలో సామాన్య భక్తులు బస చేయలేని విధంగా పాలకమండలి ఇష్టానుసారం గదుల అధ్యరేట్లను పెంచారని, అసలు ధర్మకర్తల మండలికి తిరుమలకు భక్తులు రావడం ఇష్టం లేదా అని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ ప్రశ్నించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమలలో జరుగుతున్న పరిణామాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. గడచిన మూడున్నర సంవత్సర కాలంగా టీటీడీ పరిధిలో జరిగిన ఆర్థిక కార్యకలాపాలపై అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. తిరుమల స్వామి వారితో పెట్టుకున్న వారెవ్వరు మనుగడ సాగించలేదని, గత సంఘటనలను మీడియాకు వివరించారు. స్వామి వారి సన్నిధిలో నిద్ర చేయాలని సామాన్య భక్తులు కోరుకుంటారని, అలాంటి సామాన్య భక్తులు నేడు తిరుమల కొండపై పెంచిన అద్దె రేట్లతో ఉండే పరిస్థితులు లేవన్నారు. తిరుమలలో ఎడాపెడా అనధికార దుకాణాల కేటాయింపులు జరిగాయన్నారు. ఊట్ల సురేంద్ర నాయుడు మాట్లాడుతూ శ్రీవాణి ట్రస్టు ద్వారా విక్రయిస్తున్న దర్శన టోకెన్లలో కేవలం రూ.500 లకు మాత్రమే రసీదు వస్తోందని, మిగిలిన సొమ్మంతా ఎవరి ఖాతాలకు వెళుతుందో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వట్టికుంట శంకర్ నారాయణ, బుల్లెట్ రమణ, మనోహరాచారి, రుద్రకోటి సదాశివం పాల్గొన్నారు.

'మా బలం సరిపోకపోతేనే పొత్తు'



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వచ్చే ఎన్నికల్లో తమ బలం సరిపోకపోతేనే పొత్తులతో అధికారంలోకి వస్తామని జనసేన నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతి నగరంలో ఓ ప్రైవేటు హోటల్లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ మాట్లాడుతూ ఇరు తెలుగు రాష్ట్రాల నుంచి యువశక్తి బహిరంగ సభకు యువత భారీ ఎత్తున తరలివచ్చారని, జనాదరణ చూసి ఓర్వలేక వైసీపీ పార్టీ మంత్రులు అంబటి రాంబాబు, గుడివాడ అమర్నాథ్, రోజా మాజీ మంత్రి పేర్నినాని పవన్ కళ్యాణ్ పై ఇష్టానుసారం విమర్శలు చేశారని అన్నారు. మంత్రులు, మాజీ మంత్రులపై తయారుచేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. మంత్రులుగా ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన వారు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ను విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి, పవన్ కళ్యాణ్ ను ముఖ్యమంత్రిగా చూడబోతున్నామన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ జనసేన పార్టీ కారణంగా 53 స్థానాలను టెక్నికల్ గా గెలుచుకోగలిగిందన్నారు. అధికారంలో ఉన్నామని విర్రవీగుతున్న మంత్రులు ఎమ్మెల్యేలను అధికారంలోకి రాగానే ఊసలు లెక్కబెట్టిస్తామన్నారు. సీఎం ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన తెలుగు సినీ పరిశ్రమను తన నిర్ణయాలతో కకావికలం చేశాడన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం పవన్ కళ్యాణ్ ఎన్నిమెట్లైన దిగుతారని స్పష్టం చేశారు. తిరుపతి నగరంలో ఇల్లు కట్టుకోవాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, ఇళ్ల నిర్మాణం కోసం తుడా, కార్పొరేషన్ అనుమతులు అవసరం లేకుండా కేవలం వైసీపీ అప్రూవల్ ఉంటే ఇల్లు కట్టుకోవచ్చు అనేలా పరిస్థితులను మార్చేసారన్నారు. తిరుపతి, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో జరిగిన భూకబ్జాల డబ్బులను బయటకు తీస్తే రాష్ట్రంలో రెండుసార్లు ఎన్నికలు నిర్వహించుకోవచ్చని తెలిపారు. జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ యువశక్తి సభకు సొంత ఖర్చులతో 3 లక్షల మంది యువత వచ్చారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ తిరుపతి పట్టణ అధ్యక్షులు రాజారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిని, బాబ్జి, ముక్కు సత్యవంతుడు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



ప్రజాశక్తి -రేణిగుంట: రాయల చెరువు పార్థకిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయంతో వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ వారి సమక్షంలో మన ఇంటి ఆడపడుచులకు చిరు సత్కారం అంటూ విప్పమాన పట్టెడ గ్రామపంచాయతీ లో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో రత్నమ్మ , తూకివాకం వైసీపీ సచివాలయ కన్వీనర్ అరుణాదేవి, సర్పంచ్ సుధా శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.